ఇండియా కూటమిలో సీట్ల లొల్లి

- బెంగాల్‌లో వీధికెక్కిన విభేదాలు
- సీఎం మమత దయ మాకక్కర్లేదు
- సొంతంగానే ఎక్కువ సీట్లు గెల్చుకుంటాం
- బెంగాల్‌లో సీట్ల షేరింగ్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం

కోల్‌కతా, జనవరి 4: 'ఇండియా' కూటమిలోని విభేదాలు బెంగాల్‌లో మరోసారి వీధికెక్కాయి. కూటమి పక్షాలైన తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల మధ్య లోక్‌సభ సీట్ల పంపకంపై చిచ్చు రేగింది. రాష్ట్రంలోని మొత్తం 42 సీట్లలో పొత్తులో భాగంగా కాంగ్రెస్‌కు తృణమూల్ 2 సీట్లను కేటాయించనున్నట్టు మీడియాలో వచ్చిన కథనాలపై కాంగ్రెస్ భగ్గుమన్నది. తమ పార్టీకి సీఎం మమతా బెనర్జీ దయ అవసరం లేదని, సీట్ల కోసం తమ పార్టీ దేహీ అనదని, ఆమె ఇచ్చే దాని కన్నా అక్కడ ఎక్కువ సీట్లే సొంతంగా పోటీ చేసి గెల్చుకుంటామని బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి గురువారం పేర్కొన్నారు. తృణమూల్ అధ్యక్షురాలైన మమత అసలు ఉద్దేశం ఇండియా కూటమి నుంచి బయటకు వెళ్లడమని, అందుకే ఆమె ఈ రెండు సీట్ల ప్రతిపాదన తెచ్చారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అవసరం మమతకే ఎక్కువగా ఉందని, ఆ విషయం ఆమెకు కూడా తెలుసునన్నారు.

రెండు సీట్లిస్తామని మీకెవరు చెప్పారు?

అధిర్ రంజన్ చౌదరి విమర్శలపై టీఎంసీ అధినాయకత్వం తీవ్రంగా స్పందించింది. నిత్యం చౌదరి, మరికొందరు నేతలు తమ పార్టీపై బురద జల్లుతూ పార్టీ ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ సౌగత్ రాయ్ ఆరోపించారు. తాము కాంగ్రెస్‌కు రెండే సీట్లు ఇస్తామని ఆయనకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు.

'కన్వీనర్ కాదు.. ప్రధాని పదవివ్వాలి'

పాట్నా: బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఇండియా కూటమికి కన్వీనర్‌గా కాకుండా ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని జేడీయూ మంత్రులు మదన్ సాహ్ని, రత్నేష్ సాదా గురువారం డిమాండ్ చేశారు. కూటమిలో తాను ఎలాంటి పెద్ద పదవిని ఆశించడం లేదని నితీశ్ ప్రకటించారని.. నితీశ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే కూటమిలోని అన్ని పార్టీలకు మేలు జరుగుతుందన్నారు.

ఎన్నికల ముందు అరెస్టుకు బీజేపీ కుట్ర

- ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ధ్వజం
- మళ్లీ సమన్లు జారీచేయనున్న ఈడీ!

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తన ప్రచారాన్ని అడ్డుకొనేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తనను అరెస్ట్ చేయాలనుకుంటున్నదని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమన్లు న్యాయబద్ధమైనవి కావని ఈడీకి తాను లేఖ రాశానన్నారు. 'న్యాయబద్ధంగా సమన్లు జారీ చేసి ఉంటే వాటిని నేను అంగీకరించి ఉండేవాడిని. నా నిజాయతీ నాకున్న గొప్ప సంపద. నా ఇమేజ్‌ను దెబ్బ తీయడం ద్వారా నన్ను పడగొట్టాలని వాళ్లు చూస్తున్నారు' అని ఆయన అన్నారు. తమ పార్టీ నాయకులు బీజేపీలో చేరకపోవడం వల్లే జైలుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. మరోవైపు విచారణకు హాజరు కాలేనని కేజ్రీవాల్ పంపిన లేఖను ఈడీ పరిశీలిస్తున్నది. ఆయనకు మరోసారి సమన్లు జారీ చేసే అవకాశమున్నదని ఈడీ అధికారులు వెల్లడించారు.

ఉపాధిపై ఆధార్ దెబ్బ

1 నుంచి అమల్లోకి వచ్చిన ఆధార్ ఆధారిత వేతన చెల్లింపులు

దీని వల్ల ఉపాధిహామీ పథకానికి దూరమవుతున్న 8.9 కోట్ల మంది

నరేగా సంఘర్ష్ మోర్చా ఆందోళన.. పేదలకు శరాఘాతమేనని ఆవేదన

న్యూఢిల్లీ, జనవరి 4: ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)లో ఆధార్ ఆధారిత వేతన చెల్లింపు విధానాన్ని కేంద్రం అమల్లోకి తీసుకురావటంపై ఉపాధి హామీ కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇది దాదాపు 8.9 కోట్లమంది గ్రామీణ కార్మికుల్ని అనర్హులుగా మార్చుతుందని 'నరేగా సంఘర్ష్ మోర్చా' ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ పౌర సంఘాలతో సంప్రదింపులు జరిపి 'ఏబీపీఎస్'ను తీసుకొస్తున్నారని ప్రశ్నించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉపాధి పథకంలో 'ఆధార్ ఆధారిత వేతనాల చెల్లింపు' (ఏబీపీఎస్)ను తప్పనిసరి చేస్తూ, జనవరి 1 నుంచి కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 'పేదలు, అణగారిన వర్గాలు, శ్రామికుల పట్ల కేంద్రం అత్యంత నిర్దయగా వ్యవహరిస్తున్నది. సాంకేతికత, సంక్షేమం కలపాలన్న అత్యుత్సాహంతో పాటించలేని బాధ్యతను పేద కార్మికులపై మోపుతున్నది' అని నరేగా సంఘర్ష్ మోర్చా ఆరోపించింది. 'ఏబీపీఎస్‌ను తప్పనిసరి చేయటం ద్వారా 8.9 కోట్లమంది, యాక్టీవ్ కార్మికుల్లో 1.8 కోట్లమంది పని హక్కును, వేతనాల్ని పొందే హక్కును కోల్పోతున్నారు' అని పేర్కొన్నది.

ఐదు రాష్ట్రాల ఎన్నికలతో ఆగింది..

గత ఏడాది ఆగస్టులో ఏబీపీఎస్ అమలు గడువును కేంద్రం పొడిగించింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని 'ఏబీపీఎస్' డెడ్‌లైన్‌ను 2023 డిసెంబర్ 31కి మార్చింది. ఎన్నికలు పూర్తయి.. ఓట్ల అవసరం తీరడంతో కేంద్రం ఏబీపీఎస్ అమలు చేపట్టడాన్ని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఏబీపీఎస్‌పై గత ఏడాది ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నరేగా సంఘర్ష్ మోర్చా సహా వివిధ సంఘాలు 60 రోజులపాటు ధర్నా చేపట్టాయి.

జాబ్ కార్డులు కోల్పోయినవారు

2021-22లో	2022-23లో
4.74 శాతం	19 శాతం

2023-24లో 7.72 శాతం

దేశంలో ఉపాధి హామీ కార్మికులు 25.69 కోట్లమంది

యాక్టివ్ వర్కర్స్ 14.33 కోట్లమంది

7.6 కోట్ల జాబ్ కార్డులు తొలగింపు

గత రెండేండ్లలో 7.6 కోట్లమంది రిజిష్టర్డ్ కార్మికులు జాబ్ కార్డ్ కోల్పోయారు. దీంతో వీరంతా పని హక్కును కోల్పోయారు. ఏబీపీఎస్ (ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానం)ను తప్పనిసరి చేయటం ద్వారా 2022-23లో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాబ్ కార్డులను తొలగింపునకు తెరలేపింది. మొత్తం కార్మికుల్లో 87.52 శాతం యాక్టివ్ వర్కర్స్ మాత్రమే ఏబీపీఎస్‌కు అర్హులవుతున్నారు. గత 11 నెలల్లో 12.5 శాతం మంది అనర్హులయ్యారు.

రక్తం అమ్మకానికి కాదు

- రక్తంపై ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే వసూలు చేయాలి
- దవాఖానలు, బ్లడ్ బ్యాంకులకు డీసీజీఐ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 4: దవాఖానలు, బ్లడ్ బ్యాంకులు రక్తానికి సంబంధించి కేవలం ప్రాసెసింగ్ ఫీజును మాత్రమే వసూలు చేయాలని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) సూచించింది. అత్యంత విలువైన రక్తాన్ని ఉచితంగా అందించాలన్నదే మనందరి అభిమతమని తెలిపింది. కానీ కొన్ని దవాఖానలు, బ్లడ్ బ్యాంకులు రకరకాల చార్జీలు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విధానానికి స్వస్తి పలకాలని కోరింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలను పంపింది. గత సెప్టెంబర్‌లో జరిగిన డ్రగ్స్ కన్సల్టెటివ్ కమిటీ సమావేశంలో కూడా బ్లడ్ ప్రస్తావన వచ్చిందని డీసీజీఐ వెల్లడించింది. ప్రాణాధార అయిన రక్తాన్ని అమ్మడం, ఎక్కువ చార్జీలు వసూలు చేయడం సరికాదని కమిటీ అభిప్రాయపడినట్టు పేర్కొంది. దవాఖానలు, బ్లడ్ బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజు వసూలు వరకే పరిమితం కావాలని కమిటీ కోరినట్టు తెలిపింది. తాజా మార్గదర్శకాల ప్రకారం బ్లడ్, బ్లడ్ కాంపోనెంట్స్‌కు రూ.250 నుంచి రూ.1,550 వరకు ప్రాసెసింగ్ ఫీజు సరిపోతుందని డీసీజీఐ వెల్లడించింది. అందరూ ఈ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని ఆదేశించింది. ఓ అధికారి స్పందిస్తూ ప్రస్తుతం ప్రైవేటు దవాఖానలు రక్తానికి ఫీజుల రూపంలో భారీగా వసూలు చేస్తున్నాయని చెప్పారు.

ఫుల్‌టైం రెసిడెంట్ డాక్టర్లుగా పీజీ వైద్య విద్యార్థులు

న్యూఢిల్లీ: పీజీ వైద్య విద్యార్థులు ఇక నుంచి ఫుల్‌టైం రెసిడెంట్ డాక్టర్లుగా పని చేయాల్సి ఉంటుందని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) కొత్త నిబంధనావళిని విడుదల చేసింది. సహేతుకమైన పని గంటలు, సరిపడా విశ్రాంతి వారికి కల్పించనున్నట్టు పేర్కొన్నది. ఈ మేరకు పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్, 2023ను నోటిఫై చేసింది. 'వారంలో ఒక రోజు సెలవు. ఏడాదిలో కనీసం 20 వరకు సాధారణ సెలవులుంటాయి. విద్యా సంవత్సరంలో మరో 5 రోజులు సెలవులు ఉంటాయి.' అని ఎన్ఎంసీ తెలిపింది. ఒకవేళ మరిన్ని సెలవులు వైద్య విద్యార్థి కోరినట్టయితే, ఆ మేరకు కోర్సు కాలవ్యవధి పెరుగుతుందని, శిక్షణా కాలాన్ని పొడిగించి.. పూర్తిచేయాల్సి ఉంటుందని తాజా నిబంధనల్లో పేర్కొన్నది. 80 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతిస్తారని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. కొత్త నిబంధనల నేపథ్యంలో, మెడికల్ కాలేజీలు పీజీ వైద్య విద్యార్థులకు రెసిడెన్షియల్ వసతిని ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. అయితే కాలేజీ హాస్టల్‌లోనే విద్యార్థి ఉండటం తప్పనిసరి కాదు. పీజీ మెడికల్ అడ్మిషన్లకు సంబంధించి 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్' అమల్లోకి వచ్చే వరకు 'నీట్-పీజీ' పరీక్షలు కొనసాగుతాయని ఎన్ఎంసీ పేర్కొన్నది. యూజీ మెడికల్ కాలేజీలు ఇక నుంచి మూడో ఏడాది నుంచే పీజీ కోర్సులను ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చింది. నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీ, మౌలిక వసతులను ఏర్పాటుచేసుకుంటే.. జిల్లా దవాఖానలు, చిన్న చిన్న దవాఖానలు నేరుగా పీజీ కోర్సులు ఆఫర్ చేయవచ్చునని తెలిపింది.

'రిచ్ డాడ్, పూర్ డాడ్' రచయితకు 8,300 కోట్ల అప్పు

న్యూయార్క్: 'రిచ్ డాడ్, పూర్ డాడ్' రచనతో పేరొందిన ప్రముఖ ఆర్థిక రచయిత, వ్యాపారవేత్త, జపాన్ అమెరికన్ రాబర్ట్ కియోసాకి సంచలన విషయాన్ని బయటపెట్టారు. తనకు ఒక బిలియన్ డాలర్లు (రూ.8,300 కోట్లు) కంటే ఎక్కువ అప్పు ఉందని, అయితే అది తన సమస్య కాదని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఆస్తులు, అప్పుల మధ్య క్లిష్టమైన వ్యత్యాసాన్ని వివరించారు. చాలామంది రుణాలతో అప్పులను కొనుగోలు చేస్తారని, కానీ తాను ఆస్తులను మాత్రమే కొంటానని తెలిపారు. దీనికి ఉదాహరణగా పేర్కొంటూ.. తన లగ్జరీ కార్లు ఫెరారీ, రోల్స్ రాయిస్‌లను పూర్తిగా నగదు చెల్లించి కొనుగోలు చేశానని, ఎందుకంటే అవి ఆస్తుల క్యాటగిరీ కిందకు రావని అప్పుల కిందకే వస్తాయని అన్నారు. మంచి రుణాలు సంపదను సృష్టిస్తాయని, చెడ్డ రుణాలు మరింత అప్పుల్లోకి నెడతాయని, ఇది ఆయా వ్యక్తులు వినియోగించే విధానం బట్టి ఉంటుందని అన్నారు.

జ్ఞానవాపిపై నేడు కీలక తీర్పు

వారణాసి: జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో నిర్వహించిన ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సర్వే నివేదికను బహిర్గతపరచడంపై వారణాసి జిల్లా కోర్టు శుక్రవారం తీర్పు చెప్పబోతున్నది. సీల్డ్ కవర్‌లో ఇచ్చిన ఈ నివేదికను కనీసం నాలుగు వారాలపాటు బయటపెట్టవద్దని ఏఎస్ఐ బుధవారం కోర్టును కోరిందని హిందూ పక్షం న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ చెప్పారు. ఏఎస్ఐ విజ్ఞప్తి అనంతరం ఈ కేసుపై విచారణను గురువారానికి వాయిదా వేశారు. అయితే గురువారం జిల్లా జడ్జి ఏ కే విశ్వేష్ వేరొక కార్యక్రమానికి హాజరుకావడంతో, శుక్రవారానికి వాయిదా వేశారు.

మథుర సర్వేపై సుప్రీంకోర్టుకు మసీదు కమిటీ

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఉన్న షాహీ ఈద్గాలో కోర్టు పర్యవేక్షణలో సర్వే నిర్వహించేందుకు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను మసీదు కమిటీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. శ్రీకృష్ణ జన్మభూమి దేవాలయం పక్కనే ఈ మసీదు ఉందనే సంగతి తెలిసిందే. ఈ మసీదు గతంలో హిందూ దేవాలయమని, అందుకు సంబంధించిన చిహ్నాలు ఇప్పటికీ ఉన్నాయని హిందూ పక్షం వాదిస్తున్నది. శ్రీకృష్ణ జన్మభూమి ట్రస్ట్‌కు చెందిన 13.37 ఎకరాల స్థలంలోని కొంత భాగంలో ఈ మసీదును నిర్మించారని వివరించింది. ఈ మసీదులో సర్వే కోసం కోర్టు కమిషనర్‌ను నియమించేందుకు హైకోర్టు గత ఏడాది డిసెంబరు 14న అంగీకరించింది. హైకోర్టు ఆదేశాలను నిలిపేయాలని మసీదు కమిటీ చేసిన విజ్ఞప్తిని గత డిసెంబరు 15న సుప్రీంకోర్టు తిరస్కరించింది. అపీలు చేయవచ్చునని చెప్పింది.

మణిపూర్‌లో అంబులెన్సులకు కొత్త సైరన్

ఇంఫాల్, జనవరి 4: పోలీసులు, ఇతర దర్యాప్తు ఏజెన్సీలు ఉపయోగించని ప్రత్యేక సైరన్ శబ్దాలను ఉపయోగించాలని అంబులెన్స్‌లకు మణిపూర్ ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రస్తుత సున్నిత పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, శాంతిభద్రతల సమర్థ నిర్వహణ కోసం ఈ చర్య తీసుకొన్నట్టు తెలిపింది. 'రాష్ట్రంలో అంబులెన్సులు, పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థల వాహనాల సైరన్ శబ్దం ఒకే విధంగా ఉండటం ప్రజల్లో భయాందోళనలను, గందరగోళాన్ని సృష్టిస్తున్నది. ఈ నేపథ్యంలో అంబులెన్సుల సైరన్ శబ్దం పోలీస్, దర్యాప్తు ఏజెన్సీల వాహనాల్లో వినియోగించే వాటి విధంగా ఉండకూడదు' అని హోం శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మణిపూర్‌లో ఇటీవల మళ్లీ హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి.

ఇరాన్‌లో జంట పేలుళ్లు ఐసిస్ పనే

న్యూఢిల్లీ, జనవరి 4: ఇరాన్‌లో బుధవారం జరిగిన జంట పేలుళ్లకు తమదే బాధ్యత అని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ అండ్ సిరియా (ఐసిస్) గురువారం ప్రకటించింది. యూఎస్ డ్రోన్ దాడిలో 2020లో కన్నుమూసిన కమాండర్ ఖాసిం సులేమానీ 4వ వర్ధంతిని పురస్కరించుకుని కెర్మాన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జరిగిన రెండు పేలుళ్లలో 103 మంది మృతి చెందగా, 170 మంది గాయపడ్డారు. కాగా ఈ దాడి తామే చేసామంటూ ఇస్లామిక్ స్టేట్ తన అనుబంధ టెలిగ్రామ్ చానళ్లలో వెల్లడించింది.

మొహల్లా క్లినిక్‌లపై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ, జనవరి 4: ఢిల్లీలోని ప్రభుత్వ మొహల్లా క్లినిక్కుల్లో నకిలీ టెస్టుల ఆరోపణలపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గురువారం సీబీఐ విచారణకు ఆదేశించారు. ఢిల్లీ ప్రభుత్వ దవాఖానలకు నాణ్యత లేని మందులు సరఫరా చేశారన్న ఆరోపణలు వచ్చిన కొద్ది రోజులకే ఈ విచారణకు ఆదేశించడం గమనార్హం. 'వైద్యులు మొహల్లా క్లినిక్కులకు రాకపోయినా హాజరైనట్టు, మందులు, టెస్టులు రాసినట్టు చూపించారు. కానీ నకిలీ రోగులకు ఈ టెస్టులు చేసినట్టు గుర్తించారు. దీంతో సీబీఐ దర్యాప్తునకు ఎల్జీ ఆదేశాలిచ్చారు' అని రాజ్‌నివాస్ వర్గాలు తెలిపాయి. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ వెంటనే స్పందించలేదు.

మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీగా రష్మీ శుక్లా

ముంబై: వివాదాస్పద ఐపీఎస్ అధికారిణి రష్మీ శుక్లా మహారాష్ట్ర డీజీపీగా నియమితులయ్యారు. ఓ అధికారిణి మహారాష్ట్ర డీజీపీగా నియమితులవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ముంబై పోలీస్ కమిషనర్ వివేక్ పన్‌సాల్కర్ డీజీపీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. బీజేపీ నేత ఫడ్నవీస్ మహారాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు రష్మీ శుక్లా రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. అప్పుడు ఆమె ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు రెండు కేసులు నమోదయ్యాయి.

ఈ ఏడాది ఖాళీ కానున్న 68 రాజ్యసభ సీట్లు

- అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 10
- తెలంగాణ, ఏపీలో 3 చొప్పున
- పదవీకాలం పూర్తికానున్న నేతల్లో పలువురు కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ, జనవరి 4: ఈ ఏడాది ఏకంగా 68 రాజ్యసభ ఎంపీ సీట్లు ఖాళీ కాబోతున్నాయి. రాజ్యసభ పదవీకాలం పూర్తికానున్న నేతల్లో పలువురు కేంద్రమంత్రులు, కీలక నేతలు ఉన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, మన్సుఖ్ మాండవీయ తదితరుల పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగుస్తుంది. అలాగే నలుగురు నామినేటెడ్ సభ్యులు జూలైలో పదవీ విరమణ చేయనున్నారు.

ఢిల్లీలో ఈ నెలాఖరున ఎన్నికలు

మొత్తం 68 రాజ్యసభ ఎంపీ ఖాళీలలో న్యూఢిల్లీలో ఇప్పటికే మూడు సీట్లకు ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఆప్ నేతలు సంజయ్ సింగ్, నరైన్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తాల పదవీ కాలం ముగియడంతో ఈ స్థానాలతో పాటు సిక్కింలోని ఏకైక రాజ్యసభ స్థానానికి ఈ నెలాఖరున ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ, ఏపీ నుంచి వీరే

తెలంగాణలో బీఆర్ఎస్ ఎంపీలు జోగిని పల్లి సంతోష్ కుమార్, రవిచంద్ర వద్దిరాజు, బి.లింగయ్య యాదవ్‌లు పదవీ విరమణ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, వైఎస్ఆర్‌సీపీ ఎంపీ వేమిరెడ్డిల పదవీ కాలం ఈ ఏడాది ముగియనుంది. అలాగే ఏపీకి చెందిన, యూపీ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహరావు కూడా త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. మహారాష్ట్రలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో అక్కడ ఏ పార్టీ నుంచి ఎంతమంది సభ్యులెన్నిక వుతారన్నది ఆసక్తిగా మారింది.

ఏ రాష్ట్రంలో ఎన్ని ఖాళీలు?

యూపీ	10
మహారాష్ట్ర	6
బీహార్	6
మధ్యప్రదేశ్	5
బెంగాల్	5
కర్ణాటక	4
గుజరాత్	4
ఒడిశా	3
తెలంగాణ	3
కేరళ	3
ఏపీ	3
జార్ఖండ్	2
రాజస్థాన్	2
ఉత్తరాఖండ్	1
హిమాచల్	1
హర్యానా	1
ఛత్తీస్‌గఢ్	1

ప్రత్యక్ష బరిలో సత్తా చూపండి

- రాజ్యసభ ఎంపీలను లోక్‌సభ బరిలో దించనున్న బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 4: ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 21 మంది పార్లమెంట్ సభ్యులను బరిలోకి దింపిన బీజేపీ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ మరో ప్రయోగానికి సిద్ధపడుతున్నట్టు తెలిసింది. పలువురు రాజ్యసభ సభ్యులను లోక్‌సభ బరిలోకి దిగి తమ సత్తా చాటుకోవాలని కోరే అవకాశాలున్నట్టు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. దీనిపై ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకోనున్నట్టు పేర్కొన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పలువురు కేంద్ర మంత్రులు సహా 21 మంది ఎంపీలను పార్టీ అభ్యర్థులుగా బరిలోకి దించింది. వీరిలో 12 మంది మాత్రమే గెలుపొందారు. నాయకులైన వారు ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగి ప్రజాతీర్పు పొందాలన్న అంశాన్ని బీజేపీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పలువురు రాజ్యసభ సభ్యులను తమ సత్తా నిరూపించుకోవాలని కోరే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. రాజ్యసభ ఎంపీలుగా ఉన్న కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, భూపేంద్ర యాదవ్, జ్యోతిరాదిత్య సింధియా, ధర్మేంద్ర ప్రధాన్, మన్‌సుఖ్ మాండవీయను ఆయా రాష్ట్రాల నుంచి లోక్‌సభకు పోటీ చేయించే అవకాశాలున్నట్టు పేర్కొన్నాయి.

మహిళలకు భద్రత కరువు!

- మహిళలు, చిన్నారులపై గణనీయంగా పెరిగిన నేరాలు
- ప్రభుత్వ గణాంకాల ద్వారా వెల్లడి

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని బెంగళూరు నగరంలో మహిళలు, చిన్నారులపై నేరాలు పెరిగినట్లు పోలీసు రికార్డులు చెప్తున్నాయి. మహిళలపై 2023లో 3,260 నేరాలు చోటుచేసుకోగా, వీటిలో లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులు 1,135 అని పోలీస్ అధికారులు తెలిపారు. పిల్లలపై కూడా నేరాలు గణనీయంగా పెరిగినట్టు చెప్పారు.

పిల్లలపైనా..

2023లో బాలలపై నేరాలు కూడా పెరిగాయి. పోలీసులు నమోదు చేసిన 631 కేసుల్లో 560 కేసులు పోక్సో (లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ) చట్టం కింద నమోదైనవే. మొత్తంగా గత ఏడాది బెంగళూరులో నేరాలు పెరిగాయి. హత్య కేసులు 205, గొలుసు దొంగతనాల కేసులు 153, దోపిడీ కేసులు 673, ఇళ్లల్లో దొంగతనాల కేసులు 1,692, మోటారు వాహనాల దొంగతనాల కేసులు 5,909 నమోదయ్యాయి.





వేళకు తినకపోతే గుండెజబ్బులు!

న్యూఢిల్లీ, జనవరి 4: మీరు ఎంత బిజీగా ఉన్నా ఇక నుంచి ఉదయం 8 గంటలకు టిఫిన్, రాత్రి 8 గంటలకు డిన్నర్ చేయాలని ఫిక్స్ అయిపోండి! లేకపోతే గుండె జబ్బుల బారినపడే ప్రమాదం ఉన్నది! భోజన వేళలు, గుండె జబ్బులకు మధ్య ఉన్న సంబంధాన్ని ఫ్రాన్స్‌లోని సర్బొన్నె పారిస్ నార్డ్ యూనివర్సిటీ అధ్యయనం వివరించింది. ఈ అధ్యయనంలో ఇండియా గురించి నిర్దిష్టంగా ప్రస్తావించారు. ప్రతి లక్ష జనాభాకు ప్రపంచ సగటు గుండె జబ్బు మరణాలు 235 కాగా, ఈ సంఖ్య భారత్‌లో 272గా ఉంది. నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ప్రకారం రోజులో మొదటి, చివరి భోజనం త్వరగా తినడంతో పాటు రాత్రిపూట ఎక్కువ సేపు ఉపవాసం ఉండటం గుండె జబ్బుల బారినపడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. టిఫిన్ చేయడం ఒక గంట ఆలస్యం చేస్తే గుండె జబ్బుల బారిన పడే ప్రమాదం 6 శాతం పెరిగినట్లు అధ్యయనంలో తేలింది. అలాగే రాత్రి 9 గంటల తర్వాత భోజనం చేసేవారిలో ఈ ప్రమాదం 28 శాతం పెరిగింది.

'టెట్రిస్' ఆటలో 13 ఏండ్ల బాలుడి గెలుపు

ప్రపంచంలోనే మొదటి వ్యక్తిగా రికార్డు

వాషింగ్టన్, జనవరి 4: పాపులర్ కంప్యూటర్ గేమ్ 'టెట్రిస్'లో అమెరికాకు చెందిన 13 ఏండ్ల బాలుడు విల్లీస్ గిబ్సన్ చరిత్ర సృష్టించాడు. 'నిన్‌టెండో వర్షన్' పజిల్ గేమ్‌లో 'కిల్ స్క్రీన్' వరకు చేరుకున్న తొలి వ్యక్తిగా గిబ్సన్ రికార్డులకు ఎక్కాడు. గతంలో ఈ ఘనతను కృత్రిమ మేధ (ఏఐ) మాత్రమే సాధించింది. ఇప్పటివరకు ఏ మానవుడూ ఈ ఘనతను సాధించలేదని, విల్లీస్ గిబ్సన్ (13) దానిని బద్దలు కొట్టాడని 'క్లాసిక్ టెట్రిస్ వరల్డ్ చాంపియన్‌షిప్' అధ్యక్షుడు విన్స్ క్లెమెంట్ అన్నారు. సోవియట్ రష్యాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కనుగొన్న 'టెట్రిస్' వీడియో గేమ్‌లో ఆటగాడు 29వ లెవల్‌కు చేరుకోవటమే గగనం. చాలా అరుదు. మనుషులు స్పందించలేని విధంగా గేమ్‌లో సవాల్ ఎదురవుతుంది. అలాంటిది విల్లీస్ గిబ్సన్ ఈ గేమ్‌లో 157వ లెవల్‌కు చేరుకోవటం గమనార్హం.

గాఢ నిద్ర లేకపోతే జ్ఞాపకశక్తి సమస్యలు



న్యూఢిల్లీ: ఎంత సేపు నిద్రపోయామన్నది కాదు.. నిద్ర ఎంత గాఢంగా ఉందన్నది ముఖ్